సాక్షి అనంతపురం

బుధవారం ׀ 13 ׀ సెప్టెంబర్ ׀ 2023



చీనీ టన్ను రూ. 24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.2, సరాసరిన రూ.5 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/ 22.8°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జీడిపల్లి రిజర్వాయర్‌కు జలకళ



బెళుగుప్ప: శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వస్తున్న కృష్ణాజలాలతో జీడిపల్లి రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టానికి చేరువలో ఉంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 1.67 టీఎంలు కాగా.. మంగళవారం నాటికి ప్రస్తుతం 1.45 టీఎంలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీ-నీవా కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీరు జీడిపల్లి రిజర్వాయర్‌కు వస్తోందని ఏఈ సఫృద్దీన్ తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోగానే హంద్రీ-నీవా రెండో దశ కాలువలకు, రిజర్వాయర్ పరిధిలోని చెరువులకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



ఆముదం పంటను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: ప్రభుత్వం సబ్సిడీపై అందించే ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం డీఏఓ పి.యాలేరు సమీపంలో ఆముదం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. సీసీఆర్ కార్డు కల్గిన కౌలు రైతులకు పంట రుణాలను బ్యాంక్ ద్వారా మంజూరు చేస్తారన్నారు. పీఎమ్ కిసాన్‌కు సంబంధించి రైతులు వెంటనే ఈ- కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శైలజ, ఏఓ సుచరిత, ఏఈఓ శైలజ, వీఎస్‌ఏ విద్య పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేద్దాం


అనంతపురం క్రైం: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషలాఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి కోరారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలపై ప్రోగ్రాం ఆఫీసర్లతో వారు చర్చించారు. జిల్లాలోని 51 పీహెచ్‌సీలు, 25 యూపీహెచ్‌సీలను కేంద్రంగా చేసుకుని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి దీర్ఘకాలిక, తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు సుజాత, చెన్నకేశవులు, మనోజ్, మహేంద్రనాథ్, ఓబులు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమల పేరుతో దోపిడీ

- 2014-19 మధ్య 'డెంగీ దోమలపై దండయాత్ర'
- దోమలు చావకపోగా.. మరింతగాప్రబలిన డెంగీ జ్వరాలు
- రూ.కోటిన్నర పైనే దోపిడీ జరిగినట్టు ప్రాథమిక అంచనా

డెంగీ కేసులు అప్పుడలా	
సంవత్సరం	డెంగీ కేసులు
2014	330
2015	408
2016	528
2017	805
2018	78
2019	349

డెంగీ కేసులు ఇప్పుడిలా..	
సంవత్సరం	డెంగీ కేసులు
2020	77
2021	132
2022	273
2023	101



ఇదీ.. టీడీపీ హయాంలోని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2014- 19 మధ్యన టీడీపీ ప్రభుత్వం 'డెంగీ దోమలపై దండయాత్ర' పేరిట భారీగా నిధులు ఖర్చు చేసింది. ఈ దండయాత్రలో దోమలు చావకపోగా రూ.కోట్లు ఖర్చయిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 కోట్లకు పైగా ఖర్చుచేయగా.. ఒక్క అనంతపురం జిల్లాకు రూ.కోటిన్నర పైనే వెచ్చించారు. కానీ డబ్బు దళారులపాలు కాగా.. దోమలు మాత్రం వీధుల్లో స్వైర విహారం చేయడంతో జ్వరాలు మరింత ప్రబలాయి. దోమల నియంత్రణేమో గానీ జ్వరాల ధాటికి జనం విలవిల్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వసతులు లేక, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీశారు. ప్లేట్‌లెట్స్ తగ్గాయని జనం నుంచి ప్రైవేటు ఆస్పత్రులు భారీగా దండుకున్నాయి.

నిధుల దోపిడీకి ఆనవాళ్లు కూడా లేవు

తెలుగుదేశం హయాంలో 'డెంగీ దోమలపై దండయాత్ర' పేరుతో చేసిన నిధుల వ్యయం ఆనవాళ్లు లేవు. ఖర్చు చేసిన నిధులకు అసలు బిల్లులే లేవు. ఎక్కడ ఏమి కొన్నారు, ఎంత వ్యయం అయింది అన్న లెక్కలు చూపలేదు. అప్పటి నాయకులు, కొంతమంది అధికారులు కుమ్మక్కయి దోపిడీ చేసినట్టు తెలిసింది.రూ.కోటిన్నరపైన నిధులు పక్కదారి పట్టినట్లు ప్రాథమిక అంచనా.

వైఎస్సార్‌సీపీ పాలనలో నియంత్రణలో దోమకాటు జ్వరాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మలేరియా జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. డెంగీ ప్రభావం ఉన్నా 2014-19 మధ్య కాలంలో ఉన్నంతగా లేదు. ఎక్కడికక్కడ నియంత్రణ చర్యలు చేపట్టడంతో కేసులు అదుపులో ఉన్నాయి. డ్రై డే, రకరకాల యాప్‌లతో క్షేత్రస్థాయిలో పరిస్థితులు అంచనా వేయడం, సిబ్బందిని అప్రమత్తం చేయడం వంటివి సత్ఫలితాలనిచ్చాయి. ఇప్పుడు ఎలాంటి దండయాత్రలూ లేవు. చేస్తున్నదల్లా నియంత్రణ చర్యలే.

తొలిసారి డెంగీ జ్వరాలు ఆరోగ్యశ్రీలోకి

డెంగీ జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ తగ్గాయని ప్రైవేటు ఆస్పత్రులు రూ.వేలకు వేలు పిండుకునే రోజులవి. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బాధల నుంచి విముక్తి కల్పిస్తూ డెంగీ జ్వరాలను ఆరోగ్యశ్రీలోకి చేర్చింది. రక్తపరీక్షలకు గానీ, ప్లేట్‌లెట్స్ ఎక్కించడానికి గానీ ఇలా ఏదైనా సరే రోగికి ఉచితంగా చికిత్స అందేలా చర్యలు తీసుకుంది. ఓవైపు జ్వరాలు రాకుండా నియంత్రణతో పాటు మరోవైపు జ్వరాలు వచ్చినా ఉచితంగా చికిత్సకు ఆదేశించింది.

డెంగీ నియంత్రణకు అప్రమత్తంగా...

వర్షాకాలంలో డెంగీ దోమలు వ్యాప్తి చెందకుండా అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో సిబ్బందితో నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. దీనికి ప్రజలు కూడా సహకరించాలి. మీరు చేయాల్సిందల్లా మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకుంటే దోమల వృద్ధిని పూర్తిగా నియంత్రించవచ్చు.

–డి.ఓబులు, జిల్లా మలేరియా అధికారి

రేపు ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఈ నెల 14న కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నీటి కేటాయింపులపై ప్రధానంగా చర్చించనున్నట్లు వివరించారు. హెచ్చెల్సీ పరిధిలోని అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన సాగునీటి సలహా మండలి సభ్యుల (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీ)ందరూ హాజరవుతారని తెలిపారు.

లక్ష ఎకరాల్లో ఆరుతడి పంటలకు ...

ఈ ఏడాది ఆరంభంలో మంచి వర్షాలు పడినా తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. జిల్లాలోనేకాకుండా కర్ణాటకలోని తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాల్లో కూడా తీవ్ర వర్షాభావం నెలకొంది. దీంతో హెచ్చెల్సీ కేటాయింపుల్లో తాగునీటికి 10 టీఎంసీలు పోను సాగునీటికి 16.828 టీఎంసీలు విడుదుల కానున్నాయి. ఈ నీటితో వీలైనంత ఎక్కువ ఎకరాలకు అందించాలనేదే ప్రధాన అజెండాగా ఐఏబీ సమావేశంలో చర్చించనున్నారు. లక్ష ఎకరాల్లోని ఆరు తండి పంటలకు నీరందించాలని భావిస్తున్నారు. ఆన్ అండ్ ఆఫ్ పద్ధతి అమలు చేసి ఎక్కువ రోజులు నీటిని విడుదల చేయడం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఐఏబీ సభ్యులు తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి.

అక్రమ కట్టడాల యజమానులకు జరిమానా

గుంతకల్లుటౌన్: పట్టణంలో మున్సిపల్ ప్లాన్‌కు విరుద్ధంగా భవనాలను నిర్మించిన 18 మంది యజమానులకు గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం రూ.12.15 లక్షల జరిమానాను విధించించింది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా భవనాలను నిర్మించిన 18 మందిపై కేసులు నమోదు చేయగా, వాదోపవాదాలు పరిశీలించిన పిమ్మట న్యాయస్థానం జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిచింది.

ఓట్ల తొలగింపుపై పునఃపరిశీలన పూర్తి



సీఈఓ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్వో గాయత్రీదేవి

- ఎన్నికల కమిషన్ సీఈఓకు తెలిపిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఓట్ల తొలగింపు అభ్యంతరాలపై పునఃపరిశీలన ప్రక్రియను వంద శాతం పూర్తి చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ గౌతమి తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ఓట్ల తొలగింపు పునఃపరిశీలన, తదితర ఎన్నికల అంశాలపై సీఈఓ మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్వో గాయత్రీదేవి, ఈఆర్ఓలు పాల్గొన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే, ఓట్ల తొలగింపుపై పునఃపరిశీలన ప్రక్రియను పూర్తి చేశామని ఈ సందర్భంగా సీఈఓకు కలెక్టర్ వివరించారు. 2022 జనవరి 6 నుంచి ఈ ఏడాది ఆగస్టు 9 వరకు జరిగిన 96,153 ఓట్ల తొలగింపునకు సంబంధించి అవకతవకలకు తావ్వికుండా పునఃపరిశీలన చేశామన్నారు. ఇక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో అందిన ఫారం 6, 7, 8 క్లెయిమ్‌లను ఈ నెల 15లోగా పరిశీలన పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో గుర్తించిన సమస్యలను ఎన్నికల కమిషన్ నిబంధనల అనుసరించి పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 19న రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ఫిర్యాదుల పరిశీలన, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ తదితర వివరాలను పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు మధుసూదన్, నిషాంత్‌రెడ్డి, రవీంద్ర, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, శ్రీనివాసులు, ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ ఏసీ రమణారెడ్డి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్, ఈడీటీ దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్ల దారిదోపిడీ కేసు ఛేదింపు

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- నిందితుల్లో ఇద్దరు ఏఆర్ పోలీసులు
- రూ.1.81 కోట్ల నగదు రికవరీ
- 2 కార్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం



నగదు దోపిడీకి గురైంది ఈ వాహనంలోనే (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జాతీయ రహదారి-44పై సంచలనం రేపిన రూ.2కోట్ల దారి దోపిడీ కేసును 'అనంత' పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు ఏఆర్ పోలీసులు ఉండటం గమనార్హం. వీరి నుంచి రూ.1.81 కోట్ల నగదు రికవరీ చేశారు. రెండు కార్లు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కె.శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. ఆగస్టు 22న ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన రూ.2 కోట్ల నగదుతో కంపెనీ ప్రతినిధులు ఇన్నోవా వాహనంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలోని 44వ జాతీయరహదారిపైకి రాగానే కొందరు పోలీసు దుస్తుల్లో వచ్చి అటకాయించారు. రూ.2కోట్ల నగదు బ్యాగును తీసుకుని ఉడాయించారు. దోపిడీ ఘటనపై ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పరిపాలనాధికారి శ్రీపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు. దోపిడీకి సంబంధించి తొలుత ఎలాంటి ఆధారాలూ లభించలేదు. కేసును ఎస్పీ కె.శ్రీనివాసరావు చాలెంజింగ్‌గా తీసుకుని రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలను దింపారు. 'సెబ్'ఏ ఎస్పీ రామకృష్ణతో పాటు అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి ఆధ్వర్యంలో దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

నిందితులు వీరే...

దారి దోపిడీ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు గుర్తించారు. నిందితుల్లో వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం మల్లాయపల్లికి చెందిన కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కడపకు చెందిన వేంపల్లి సూర్యనారాయణరాజు, ఏఆర్ కానిస్టేబుల్ చేమర్తి సుబ్బరామరాజు అలియాస్ సుబ్బరాజు, నెల్లూరు జిల్లాకు చెందిన హైదరాబాద్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుంచె వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్, రంగారెడ్డి జిల్లాకు చెందిన బండ్లగూడజాగీర్ వాసి గుర్రాల విజయ్‌కుమార్, హైదరాబాదులోని మాదాపూర్ పర్వతనగర్‌కు చెందిన చెంజీ రేవంత్‌కుమార్ ఉన్నారు.

దోపిడీకి వ్యూహకర్త ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్..

దారిదోపిడీకి హైదరాబాద్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుంచె వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ వ్యూహకర్త. ఇతనికి ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీలో డ్రైవరుగా పనిచేసే రంగారెడ్డి జిల్లాకు చెందిన గుర్రాల విజయ్‌కుమార్, అన్నమయ్య జిల్లాకు చెందిన చెంజీ రేవంత్‌కుమార్‌తో పరిచయముంది. ఈ పరిచయమే రూ.2 కోట్ల దోపిడీకి దారి తీసింది. పెద్ద మొత్తంలో వచ్చే నగదు, వాహనాలు, ఇతర సమాచారాన్ని విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకుని దోపిడీకి తెగబడ్డారు. ఈ క్రమంలో వేణుగోపాల్‌రెడ్డిని వెంకటేష్ కలిసి దారి దోపిడీకి ప్రణాళిక రచించారు. మరికొందరిని కలుపుకొని ప్రణాళికను అమలు చేయాలని భావించారు. అందులో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ సుబ్బరామరాజుతో పాటు మహేశ్వరరాజును కలుపుకుని ఆగస్టు 22న కడప నుంచి అనంతపురం బయల్దేరి వచ్చారు. ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీ డ్రైవర్ రేవంత్ ఇచ్చిన సమాచారంతో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద కాపు కాశారు. పోలీసు దుస్తుల్లో రంగంలోకి దిగి.. డబ్బుతో వస్తున్న ఇన్నోవా కారును ఆపి కంపెనీ పరిపాలనాధికారి శ్రీపతిరావు, అనుపమరావు, డ్రైవరు శివను భయపెట్టి.. వాహనంలో తరలిస్తున్న రూ.2కోట్ల నగదున్న బ్యాగును తీసుకుని పరారయ్యారు. దోపిడీ సొమ్మును మొత్తం ఏడుగురు పంచుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుల కోసం దర్యాప్తు వేగవంతం చేశారు. అందిన సమాచారం మేరకు.. కడప శివారులో తిరుపతి హైవే పక్కన నిరుపయోగంగా ఉన్న ధాబా వద్ద ఉన్న ఆరుగురు నిందితులు కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరాజు, సుబ్బరామరాజు, కుంచె వెంకటేశ్వర్లు, గుర్రాల విజయకుమార్, చెంజీ రేవంత్‌కుమార్‌లను అరెస్టు చేశారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI DIGITAL MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 9912220717

శిబిరం చిరునామా:
విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్,
డో.నం: 6-2-39, కోవూరునగర్, అనంతపురం.

అర్థమయ్యేలా డిజిటల్ బోధన

ఆధునిక బోధన విధానాలను అనుసరిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ రీతిలో అత్యున్నత పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రతి తరగతి గదిలో డిజిటల్ బోధనకు శ్రీకారం చుడుతున్నాం. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన పరికరాలు ఏర్పాటు చేస్తాం.

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అనంతపురంలోని పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ద్వారా బోధన

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత సులువుగా పాఠాలు అర్థమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. స్మార్ట్ బోధన సదుపాయాల వల్ల ఇటు పిల్లలకు, అటు ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6-10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీల) ద్వారా, ప్రాథమిక పాఠశాల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు స్మార్ట్ టీవీల ద్వారా బోధిస్తున్నారు. ఐఎఫ్‌పీలు ప్రతి పాఠశాలలోనూ ఒక్కో తరగతి గదిలో ఒక్కో ప్యానెల్ ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో పాఠశాలకు 15 నుంచి 25 ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్యానెల్‌ను తరగతి గదిలో ఏర్పాటు చేయడానికి రూ.1.60 లక్షల దాకా ఖర్చవుతుంది. అంటే ఐఎఫ్‌పీల కోసమే ఒక్కో పాఠశాలకు రూ.24 లక్షల నుంచి రూ.40 లక్షల దాకా వ్యయం చేస్తున్నారు. తొలివిడతలో 'మనబడి నాడు-నేడు' కింద ఎంపికైన పాఠశాలల్లో డిజిటల్ బోధన అమలు చేస్తున్నారు.

- జిల్లాలో 245 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1595 ఐఎఫ్‌పీలు, 414 ప్రాథమిక పాఠశాలల్లో 758 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. ఆయా స్కూళ్లలో డిజిటల్ బోధన ప్రారంభమైంది. ఐఎఫ్ ప్యానెళ్ల పక్కనే రెండు గ్రీన్‌బోర్డులూ ఏర్పాటు చేశారు. ఐఎఫ్‌పీల ద్వారా బోధనపై టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. కరెంటు లేని సమయంలో వీటిని వినియోగించనున్నారు. రెండో విడత స్కూళ్లకూ ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు సరఫరా అవుతున్నాయి.

ఐఎఫ్‌పీ వల్ల ఉపయోగాలు

- కంప్యూటర్‌లో విండోలను మార్చుకున్నట్టు, ఐఎఫ్ ప్యానళ్లలో తెరలను ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు.
- గ్రాఫ్, మ్యాప్‌లను గూగుల్ డ్రైవ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని స్క్రీన్‌పై బోధించవచ్చు. పెన్‌డ్రైవ్‌లు, సీడీల్లో ఉన్న వాటిని, పీపీటీలను సైతం తెరపై ప్రదర్శించవచ్చు.
- యానిమేషన్, డిజిటల్ చిత్రాలను వినియోగించుకోవచ్చు. పేపర్ క్లిప్పింగులు వంటి వాటిని సులభంగా తరగతి గదిలో ప్రదర్శించవచ్చు.
- తెరపై పాఠ్యాంశాలతో పాటు అనుబంధ అంశాలనూ బోధించవచ్చు.
- బ్లాక్‌బోర్డుగా వాడటమే కాకుండా, వీడియోలు, చిత్రాలనూ ప్లే చేయవచ్చు.

ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చాం



మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న డిజిటల్ బోధనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 6-10 తరగతుల విద్యార్థులకు ఐఎఫ్‌పీ, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు స్మార్ట్‌టీవీల ద్వారా బోధిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ బోధన అమలవుతోంది. ఐఎఫ్‌పీల వినియోగంపై సంబంధిత టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చాం. డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు చాలా సులువుగా పాఠాలు అర్థమవుతాయి.

– వి.నాగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి

19 నుంచి డీఎడ్ పరీక్షలు

రాప్తాడు రూరల్: డీఎడ్ మొదటి సెమిస్టర్, నాల్గో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 25 వరకు ఉంటాయని డీఈఓ నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెమిస్టర్, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నాల్గో సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు 'షీప్' యూనియన్ మహాజన సభ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ మహాజన సభ బుధవారం ఏర్పాటు చేయనున్నట్లు త్రీమెన్ కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీడీసీ నిధుల మంజూరు, పెండింగ్ బకాయిల వసూళ్లు, గొర్రెల పెంపకం దారుల కష్టనష్టాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, గ్రామ స్థాయిలో సొసైటీల ఏర్పాటు, సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ఆడిట్, కొత్త సభ్యుల చేరిక తదితర అంశాలపై చర్చించనున్నారు. అనంతపురంలోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే మహాజన సభకు రెండు జిల్లాలకు చెందిన సంఘాల అధ్యక్షులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

ఖాతాల్లో డబ్బు మాయం!

- వారం వ్యవధిలో పదుల సంఖ్యలో బాధితులు
- సైబర్ మోసాలకు అమాయకుల బలి

కళ్యాణదుర్గం: బ్యాంక్ అంటే సామాన్యునికి తన సొమ్ము భద్రంగా ఉంటుంది అని ఒక భరోసా. కానీ ఇప్పుడు ఆ బ్యాంక్‌లో ఖాతాలే సామాన్యులను లూటీ చేస్తున్నాయి. ఖాతాదారులకు తెలియకుండానే వారి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు మాయమవుతున్న ఉదంతాలు ఇటీవల ఎక్కువయ్యాయి. దీంతో ఖాతాదారులు ఇదేమిటి అని బ్యాంక్ అధికారులను ప్రశ్నిస్తే సైబర్ నేరం అంటూ చేతులెత్తేస్తున్నారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే సైబర్ నేరగాళ్లు కళ్యాణదుర్గం ప్రాంతంలో పదుల సంఖ్యలో ఖాతాదారుల బ్యాంక్ ఖాతాల నుంచి నగదు దోచేశారు. ఈ రెండు రోజులుగా ఈ పరిస్థితి మరీ ఎక్కువైంది. దీంతో పలువురు ఖాతాదారులు బ్యాంక్‌ల్లో తమ డబ్బును హోల్డ్‌లో ఉంచేస్తున్నారు. కాగా, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు కోల్పోయిన బాధితులందరి తీరు ఒక్కటిగానే ఉంటోంది. మాయమైన నగదు మొత్తం బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్‌పీ) లోనే విత్ డ్రా అయినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడం గమనార్హం.



సైబర్ మోసాలు మచ్చుకు కొన్ని

- కళ్యాణదుర్గం నివాసి యోగానందకు స్థానిక ఎస్‌బీఐలో ఖాతా ఉంది. వ్యాపారానికి సంబంధించి బ్యాంక్‌లో రుణం తీసుకున్నాడు. నెలవారీ కంతు చెల్లించేందుకు రూ.5వేలు నిల్వ చేస్తూ వచ్చాడు. ఈ నెల 11వ తేదీ కంతు కట్ కావాల్సి ఉంది. అయితే అదే రోజు అతని వ్యక్తిగత ఖాతా నుంచి రూ.5వేలు సీఎస్‌పీ కేంద్రం ద్వారా విత్ డ్రా చేసినట్లు అతని సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకు అధికారుల వద్దకెళ్లి విచారణ చేయగా.. ఆన్‌లైన్‌లో కంప్లైంట్ రైజ్ చేయాలని సూచించారు. కంతు చెల్లించాల్సిన తరుణంలో నగదు కాస్త మాయం కావడంతో బాధితుడు లబోదిబో మంటూ పోలీసులను ఆశ్రయించాడు.
- కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన నడిమిండ్ల వన్నూరుస్వామి చిన్నపాటి వైరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఎస్‌బీఐ ఖాతాలో కొంత నగదు దాచుకున్నాడు. ఆగస్టు 27న అతనికి తెలియకుండానే అతని ఖాతా నుంచి రూ.9 వేలు, 28వ తేదీ మరో రూ.10 వేలు విత్ డ్రా చేసినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ అందింది. అది చూసి వెంటనే సోమవారం బ్యాంకు అధికారులను కలసి మాట్లాడారు. కంప్లైంట్ ఇవ్వాలని బ్యాంకు సిబ్బంది సూచించారు.
- శెట్టూరులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మూర్తి సెల్‌ఫోన్‌కు ఆయన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఆగస్టు 26న రూ.9 వేలు విత్ డ్రా అయినట్లు మెసేజ్ అందింది. తన ప్రమేయం లేకుండానే బ్యాంక్ ఖాతాలో నగదు ఎలా మాయమైందంటూ వెంటనే బ్యాంక్ అధికారులను కలసి ఆరా తీశారు. ఆన్‌లైన్‌లో కంప్లయింట్ రైజ్ చేయాలని బ్యాంక్ అధికారులు సూచించడంతో ఆయన అలాగే చేసి, ఖాతా నుంచి మాయమైన నగదు ఎప్పుడు జమ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు.



నాగిరెడ్డి ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.20 వేల నగదు విత్ డ్రా అయినట్లు చూపుతున్న లావాదేవీలు

మీరు చూస్తున్న ఈ బ్యాంక్ ఖాతా వివరాలు బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి గ్రామానికి చెందిన జి.నాగిరెడ్డిది. నిరుద్యోగి. వైకల్యంతో బాధపడుతున్నాడు. కష్టపడి సంపాదించుకున్న నాలుగు పైసలు పోగు చేసుకుని ఎస్‌బీఐ ఖాతాలో జమ చేసుకున్నాడు. అయితే ఆయనకు తెలియకుండానే ఆ ఖాతాలో నుంచి ఈ ఏడాది ఆగస్టు 27న రూ.10వేలు, 28వ తేదీ మరో రూ.10వేలు మాయమయ్యాయి. విషయం తెలుసుకున్న బాధితుడు నేరుగా బ్యాంక్ అధికారులను కలసి ఆరా తీస్తే సైబర్ నేరగాళ్ల పనిగా తేలింది. ఈ పరిస్థితి నాగిరెడ్డి ఒక్కరిదే కాదు... జిల్లా వ్యాప్తంగా వందల మంది ఖాతాదారుల సొమ్మును సైబర్ నేరగాళ్లు అప్పనంగా దోచేస్తున్నారు.

వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు



అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు అడిగితే తెలపకుండా ఉండడమే మంచిది. ఖాతాలో డబ్బు విత్ డ్రా జరిగిన వెంటనే బ్యాంకు అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సైబర్ మోసాలపై ప్రజల్లో మరింత చైతన్యం రావాలి.
– బి.శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

రోజుకు ఐదారుగురు..

సాంకేతికత అభివృద్ధి చెంది, డిజిటల్ క్యాష్ లావాదేవీలు భారీగా జరుగుతున్న ప్రస్తుత రోజుల్లో ఉద్యోగుల మొదలు సామాన్యుల వరకూ తమ బ్యాంకు ఖాతాలో సొమ్మును అత్యధికంగా నిల్ల చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలను లూటీ చేస్తుండడంతో ఆందోళనకు గురైన పలువురు తమ ఖాతాలను హోల్డ్‌లో ఉంచాలని బ్యాంకర్లను అభ్యర్థిస్తున్నారు. ఇలా రోజుకు ఐదారుగురు ఖాతాదారులు తమ వ్యక్తిగత ఖాతాలను హోల్డ్‌లో ఉంచుకుంటున్నట్లు బ్యాంక్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా, వ్యక్తిగత ఖాతా నుంచి నగదు మాయమైనట్లుగా గుర్తించిన వెంటనే ఖాతాదారులు నేరుగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెబ్‌సైట్‌లోకి వెళ్లి కంప్లైంట్ రైజ్ చేస్తే, మాయమైన నగదు రికవరీ అయ్యే అవకాశం ఉందని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు.

సచివాలయ ఉద్యోగాల కోసం 23 మంది అంగీకారం

అనంతపురం సిటీ: గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల కోసం 23 మంది ముందుకొచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిషత్ కార్యాలయాలతో పాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యా శాఖలో పని చేస్తూ కోవిడ్‌బారిన పడి మృతి చెందిన ఉద్యోగుల వారసులకు సచివాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 32 మంది ఉద్యోగులు కరోనా మహమ్మారి బారిన పడి మరణించారు. వారి వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి సంకల్పించారు. బాధిత కుటుంబాల వారికి వ్యక్తిగతంగా ఫోన్లు చేసి, ఆప్షన్లు ఇవ్వాలని జెడ్పీ ఉద్యోగులు సమాచారం అందించారు. దీంతో 23 మంది తాము సచివాలయ ఉద్యోగాలకు అంగీకార పత్రాలు సమర్పించారు. శని, ఆదివారాల్లో వీరంతా వచ్చి జెడ్పీ అధికారులకు తమ అంగీకారాన్ని తెలిపారు. ఇంకా పది మంది మిగిలి ఉన్నారు. వారికి మరోసారి ఫోన్లు చేసి, సమాచారం తెలిపారు. ఇప్పటి వరకూ అంగీకార పత్రాలు సమర్పించిన వారికి సంబంధించి సమగ్ర నివేదికలు తయారు చేస్తున్నారు. మిగిలిన వారు కూడా త్వరితగతిన వచ్చి అంగీకారపత్రాలు సమర్పిస్తే ఉద్యోగావకాశం కల్పించేందుకు నివేదికలు రూపొందిస్తామని జెడ్పీ అధికారులు అంటున్నారు.

వివాహిత బలవన్మరణం

ధర్మవరం అర్బన్: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని దుర్గానగర్‌కు చెందిన వెంకట్రాముడు భార్య తలారి దుర్గమ్మ (40) చేపల వ్యాపారంతో జీవనం సాగిస్తోంది. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె మంగళవారం తెల్లవారుజామున నొప్పి తీవ్రత భరించలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంట్రాక్టర్ వేతనం ఇవ్వడం లేదు

- చర్యలు తీసుకోవాలంటూ తాగునీటి పథకం కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

అనంతపురం అర్బన్: ఐదు నెలలుగా తమకు వేతనం ఇవ్వకుండా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నిర్వహణ కాంట్రాక్టర్ వేధిస్తున్నాడంటూ ఆ తాగునీటి పథకం కార్మికులు మంగళవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు జి.ఓబులు మాట్లాడుతూ... హిందూపురం డివిజన్‌లో కాంట్రాక్ట్ ఏజెన్సీగా ఉన్న ఏఎస్‌ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కాంట్రాక్టర్ ఇక్కడి కార్మికులకు ఐదు నెలలుగా వేతనం ఇవ్వలేదన్నారు. అలాగే 18 నెలలుగా పీఎఫ్ కూడా చెల్లించడం లేదన్నారు. సంస్థ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారన్నారు. అతను మాత్రం బకాయిలు చెల్లించడం లేదన్నారు. అంతే కాక ఒక్కొక్క కార్మికుని వేతనం నుంచి ప్రతి నెలా రూ.2,500 కోత విధిస్తున్నారన్నారు. అలాగే మడకశిర డివిజన్‌లో కార్మికులకు అక్కడి కాంట్రాక్టర్ 14 నెలల పీఎఫ్ చెల్లించలేదన్నారు. ప్రతి కార్మికుని వేతనం నుంచి నెలకు రూ.2,500 చొప్పున కోత విధిస్తున్నారని వివరించారు. నకిలీ కార్మికుల పేర్లతో ప్రతి నెలా రూ.7 లక్షల మేర బిల్లులు చేసుకుంటూ కార్మికుల సొమ్ము కాజేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టి కార్మికులకు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మిక సంఘం అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి హనుమంతు. ఉపాధ్యక్షుడు సోమశేఖర్, సంయుక్త కార్యదర్శి మంజు, నాయకులు నాగభూషణం, గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

మాతాశిశువులకు మెరుగైన సేవలందాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం క్రైం: మాతాశిశువులకు మెరుగైన వైద్య సేవలందించి, మరణాల నియంత్రణకు కృషి చేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. గత నెలలో జరిగిన ఆరు మాతృ, ఐదు శిశు మరణాలపై ఆయా వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులతో మంగళవారం తన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. మరణాలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది వ్యవహరించిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మాతాశిశు మరణాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ నేపథ్యంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గర్భిణి వివరాలు 12 వారాల్లో రిజిస్టర్ చేసి, ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, ఇతర సేవలందించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత వైద్యాధికారులదేనన్నారు. హైరిస్క్ కేసుల పట్ల మరింత శ్రద్ధ తీసుకుని, ఆస్పత్రుల్లో సుఖ ప్రవసం జరిగేలా చూడాలన్నారు. రవాణాకు సంబంధించి 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ... రక్తహీనత, గుండె, బీపీ, డయాబెటిక్, తక్కువ ఎత్తు, కాన్పుకు కాన్పుకు ఎక్కువ సమయం ఉన్నా, తల్లి గర్భంలో ఉమ్మనీరు తక్కువగా ఉన్నా, గర్భస్థ శిశువు ఎదుగుదల లేకపోయినా హైరిస్క్ గర్భిణిలుగా గుర్తించి ప్రత్యేక సేవలందించాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, జీజీహెచ్ వైద్యులు డాక్టర్ పార్వతి, డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ సురేఖ, లక్ష్మన్న, హేమలత పాల్గొన్నారు.

కోర్టుల్లో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్, చిత్రంలో కలెక్టర్ గౌతమి

అనంతపురం: కోర్టుల్లో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ చూపాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ సూచించారు. జిల్లా జడ్జి చాంబర్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు పిల్లల సంరక్షణ కేంద్రాలు, కోర్టులలో మహిళలకు మరుగుదొడ్లు, శానిటరీ నాప్కిన్స్ ఏర్పాటు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా డీఆర్‌ఓ కొండయ్య పాల్గొన్నారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని కోర్టుల్లో మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించేందుకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు తయారు చేసి 15 రోజుల్లోగా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అనంతపురం కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ పిల్లల సంరక్షణ కేంద్రాలు, కోర్టుల్లో మహిళలకు తగిన సౌకర్యాలు అందుబాటులోకి తేవడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ప్రమాదాలు జరిగితే 108కి ఫోన్ చేయండి

- ఉమ్మడి అనంతపురం జిల్లా 108 డీఎం సంజీవరెడ్డి

కూడేరు: ఎక్కడైనా ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు, ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 108 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చునని ఉమ్మడి అనంతపురం జిల్లా 108 డీఎం సంజీవరెడ్డి అన్నారు. కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–7వ ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో 108 సేవలపై క్యాడెట్లకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్నా, గర్భిణిలు పురిటి నొప్పులతో బాధపడుతునా, ఎవరైన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా, ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందిగా ఉన్నప్పుడు 108 నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రాథమిక వైద్యం అందిస్తూ ఆస్పత్రికి చేరుస్తారన్నారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు, 108 ఈఎంటీ తిప్పేస్వామి, పైలట్ నాగరాజు, ఓబులు పాల్గొన్నారు.

ఎస్‌సీఆర్ ఏజీఎం సుడిగాలి పర్యటన

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధనుంజయులు సోమవారం గుంతకల్లులో సుడిగాలి పర్యటన చేశారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో విచ్చేసిన ఆయనకు గుంతకల్లు డివిజన్ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఏడీఆర్‌ఎం సూర్యనారాయణతో కలసి గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. క్యాంటీన్లు, ప్రయాణికులు విశ్రాంత గదులు పరిశీలించి, అక్కడున్న ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం సేష్టన్ యార్డును తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన నంచర్ల–మల్లప్పగేట్ బైపాస్ రైల్వే మార్గంలోని మల్లప్పగేట్ క్రాసింగ్ సేష్టన్‌ను పరిశీలించారు. ఆ మార్గంలోని సిగ్నల్ పాయింట్ల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని ఉద్యోగులకు సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సాయంత్రం రైల్వే క్లబ్‌లో డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ధర్మవరం రైల్వే సేష్టన్ యార్డులో ఫేజ్–2 కింద చేపట్టబోయే పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీఎఫ్‌ఎం అక్కిరెడ్డి, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నటదిగ్గజం సోమిరెడ్డి

ఆచార్య దేవ. హహ్హ ఏమంటివి? ఏమంటివి?
జాతి నెపమున సూత సుతునకిందు నిలువ
అర్హత లేదందువా! ఎంత మాట. ఎంత మాట!
ఇది క్షాత్ర పరీక్షయే కాని క్షత్రియ పరీక్ష కాదే?
కాదు కాకూడదు ఇది కులపరీక్షయే అందువా!
నీ తండ్రి భరద్వాజుని జననమెట్టిది ?..............
..... మా వంశమునకు మూలపురుషుడైన వశిష్టుడు దేవ వేశ్యయగు ఊర్వశీపుత్రుడు కాదా? అతడు పంచమజాతి కన్యయగు అరుంధతియందు శక్తిని, ఆశక్తి చండాలాంగానయందు పరాశరుని, ఆ పరాశరుడు పల్లెపడుచు మత్స్యగంధియందు మా తాత వ్యాసుని, ఆ వ్యాసుడు విధవరాండ్రైన మా పితామహి అంబికతో మా తండ్రిని, పినపితామహి అంబాలికతో మా పినతండ్రి పాండురాజును, మా ఇంటిదాసితో ధర్మనిర్మానజనుడని మీచే కీర్తింపబడుచున్న హ.. ఈ విదురదేవుని కనలేదా? సందర్భావసరములను బట్టి క్షేత్రబీజ ప్రాధాన్యములతో సంకరమైన మా కురువంశము ఏనాడో కులహీనమైనది. కాగా, నేడు కులము.. కులము అను వ్యర్థవాదములెందుకు?

... అంటూ ద్రోణుడి జాత్యాహంకారాన్ని వ్యతిరేకిస్తూ సుయోధనుడి పాత్రధారి కుమ్మెత సోమిరెడ్డి గంభీరంగా డైలాగులు పలికినప్పుడు రంగస్థల ప్రాంగణం చప్పట్లతో ఓ ఐదు నిమిషాల పాటు మార్మోగింది. ఆ తర్వాత వన్స్‌మోర్ నినాదాలతో ప్రేక్షకులు రెచ్చిపోయారు. పౌరాణిక నాటకాలంటే ముందుగా అనంత పేరు గుర్తొచ్చేలా నవరసాలను పలికిస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న వారిలో సోమిరెడ్డి ముందు వరుసలో ఉంటారు.



సుయోధనుడి పాత్రలో సోమిరెడ్డి

అనంతపురం కల్చరల్: అచ్చు సీనియర్ ఎన్టీఆర్‌ను తలపించేలా ఉండే కుమ్మెత సోమిరెడ్డి..... రారాజు పాత్ర వేశాడంటే అభిమానులు మంత్ర ముగ్ధులవ్వాల్సిందే. డైలాగులు చెప్పే తీరు, మధురంగా ఆలపించే పద్యాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి. ప్రతిచోటా కరతాళధ్వనులు, వన్స్‌మోర్లతో ఆడిటోరియాలను మార్మోగించే కళాకారుల్లో సోమిరెడ్డిది అగ్రస్థానం. ఆయనలోని కళాకారుడిని గుర్తించిన అనేక సంస్థలు అవార్డులు, రివార్డులతో సత్కరించాయి. కర్ణాటకకు రాఘవ కళాసంస్థ వారు ప్రతిష్టాత్మక నటులకిచ్చే 'బళ్లారి రాఘవ పురస్కారం'తో పాటు మరెన్నో పురస్కారాలను ఆయన అందుకున్నారు.

పాత్రేదైనా ఒదిగిపోవడమే

కూడేరు మండలం పి.నారాయణపురానికి చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు కుమ్మెత చిన్నారెడ్డి కుమారుడు సోమిరెడ్డి... చిరుప్రాయం నుంచే రంగస్థలం వైపు ఆకర్షితులయ్యారు. తనకు దక్కిన ప్రతి పాత్రకూ న్యాయం చేస్తూ వస్తున్నారు. వారణాసిలో సత్యహరిశ్చంద్రునిగా, మహాభారతంలో భీముడిగా, రామాయణ ఘట్టాల్లో రాముడిగా, భాగవతంలో కృష్ణుడిగా, బాలనాగమ్మలో బాలవర్ధిగా అసమాన నటనను ప్రదర్శించే సోమిరెడ్డి ముఖ్యంగా రారాజు పాత్రలో ఒలికించే రాజసానికి ప్రేక్షకులు నీరాజనాలు పడుతుంటారు. గత 40 ఏళ్లలో ఆయన ఎన్ని పాత్రలు పోషించినా.. సుయోధనుడి పాత్ర మాత్రం ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది. అనంతలోనే కాకుండా తిరుపతి, విజయవాడ, రాజమండ్రి, హైదరాబాదు తదితర చోట్ల ఆయన నటించిన మయసభ సీను చూసిన ప్రేక్షకులకు ఓ మధుర జ్ఞాపకంగా నిలిచిపోయింది.

ఏమిచ్చినా తీర్చుకోలేం

పౌరాణిక నాటకానికి తగినట్లుగా మంచి వర్చస్సు, అభినయం, ఆంగికం అన్నీ కుదరాలంటే సద్గురువుల ఆశీస్సులుండాలని సోమిరెడ్డి అంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖ్యాతి గాంచిన గుమ్మడి గోపాలకృష్ణ, కోటేశ్వరరావు లాంటి వారి సరసన నటించే అవకాశం తనకు దక్కడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దుర్యోధనుడు, భీముడి పాత్రలు ఎంతో పేరు తెచ్చిపెట్టాయని, అనంత రంగస్థలానికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని అంటున్న ఆయన గత నాలుగేళ్లగా తన సొంత ఖర్చుతో పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

ఆమిద్యాలలో ఘనంగా ఉట్ల పరుష

ఉరవకొండ మండలం ఆమిద్యాలలో మంగళవారం ఉట్ల పరుషను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పెన్నహోబిలం లక్ష్మీనృసింహుని ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు ఉట్టికొట్టేందుకు పోటీ పడ్డారు. ఉత్సవాన్ని చూసేందుకు భారీగా ప్రజలు తరలిరావడంతో ఆమిద్యాల జనసంద్రమైంది.
- ఉరవకొండ



ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు

ఉత్సాహంగా క్రీడా ఎంపిక పోటీలు


నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

రాప్తాడురూరల్: అనంతపురం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గస్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం త్రోబాల్, కబాడ్డీ, టెన్నీకాయిట్ విభాగాల పోటీలు జరిగాయి.

- అండర్–17 విభాగం కబడ్డీలో ఎస్.రియాజ్, మహమ్మద్ ముక్తర్, బి.ఇషాంత్, ఎస్.మనికుమార్, ఎం.ప్రేమచరణ్, ఎస్.ఆసీఫ్, సి.భరత్, కె.సుమంత్, ఎస్.కార్తికేయ, సి.అనిల్‌కుమార్, ఎస్.మహేష్‌బాబు, ఎం.అభిషేక్ బన్నీ, జి.ప్రేమ్‌సాగర్, సి.సాయిచైతన్య, ఎస్.అశోక్ ఎంపికయ్యారు.
- అండర్–14 విభాగంలో నరేంద్ర, నందు, వినయ్‌వరుస్, ప్రభాంద్, మహమ్మద్ ఆరీఫ్, బాబాఫకృద్దీన్, పవన్, మహబూబ్, వరుణ్, మోహిత్‌సాయి, అల్తాఫ్ హుసేన్ ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా మహమ్మద్, కౌషిక్‌ను ఎంపిక చేశారు. = అండర్–17 త్రోబాల్ విభాగంలో చరణ్ తేజ, గౌతమ్ చందుసాయి, విద్యాసాగర్, అభిషేక్, కె.భాస్కర్, బి.భార్గవ్, రతీబ్, పవన్‌కుమార్, సాయికృష్ణ, జెమిత్‌కుమార్, అర్జున్, చరణ్, అనిల్‌కుమార్, జశ్వంత్ కుమార్ ఎంపికయ్యారు.
- అంగర్–14 విభాగలో నరేంద్ర, బాబామహబూబ్, మోహిత్ సాయితేజ, డేవిడ్, మహమ్మద్, ఈశ్వర్ వరుణ్, నందువర్దన్, ఇమ్రాన్, అబ్దుల్ రహిమాన్, అజయ్‌కుమార్, భూరి శ్రవణ్, ఇబ్రహీం, ముకుంద, శశికుమార్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీంద్రబాబు, ఎస్జీఎఫ్ కార్యదర్శి సుగుణమ్మ, పీడీలు చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి, సుగంధ, మునేనాయక్, వన్నూర్, ప్రమీలరాణి, కమలమ్మ, లావణ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలు అండర్–14, అండర్ 17 బాల బాలికలకు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీడా పోటీలు జరిగాయి. కబడ్డీ, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1,500 మీటర్ల పరుగు పందేలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికవుతారని ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు నాగరాజు, సునీత, శ్రీవాణి, జగ్గు, జగదీష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

కనగానపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు. బాలబాలికలకు రెండు విభాగాలుగా జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌తో పాటు కొన్ని అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఉదయం 8 గంటల లోపు పాఠశాల వద్దకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

క్లుప్తంగా

ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే పరిహారం


మరూరులో ఈ క్రాప్ గురించి రైతులకు వివరిస్తున్న ఏడీఏ రవి

రాప్తాడు: ఖరీఫ్‌లో సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకుంటునే పరిహారం అందుతుందని ఏడీఏ రవి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని మరూరులో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల పంట నష్టపోతే పరిహారం అందుతుందన్నారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకుని ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేపించుకొనే రైతులు ఆర్‌బీకేల్లో వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ నెల 15లోపు ఈ క్రాప్ బుకింగ్ చేపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్ రెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాపంపేట స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈఓ


రాగిమాల్ట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ నాగరాజు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు తనిఖీ చేశారు. ఇదే సమయంలో విద్యార్థులకు రాగిమాల్ట్ ఇస్తున్నారు. డీఈఓ రాగిమాల్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. డిజిటల్ బోధనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీలు, ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్‌టీవీలను సరఫరా చేసిందన్నారు. అత్యాధునిక పరిజ్ఞానంతో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వర్క్‌బుక్, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దను మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆశ్లేష బలి పూజలు


ఆశ్లేష బలిపూజలు నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్: రాప్తాడు మండలం బొమ్మేపర్తి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో ఆశ్లేషబలి పూజలు ఘనంగా జరిగాయి. శ్రావణమాసంలో వచ్చిన చివరి మంగళవారం ఆశ్లేష నక్షత్రాన్ని పురస్కరించుకొని శాస్త్రోక్తంగా సాగిన ఆశ్లేష పూజలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చంద్రశేఖర అవధాని, గండ్లూరి అమరసింహదత్త ఘనాపాటి ఆధ్వర్యంలో శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, అన్నప్రసాద నైవేద్య వితరణ జరిగాయి.

16 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'


మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగావతి

చెన్నేకొత్తపల్లి: ఈనెల 16 నుంచి 29 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి అన్ని గ్రామాల్లో సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవినాయక్, సీహెచ్‌ఓ గోవిందమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఫ్లై ఓవర్‌పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన శ్రీనివాసులు పని మీద బైక్‌పై గుతికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. అయితే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెళుతున్న సమయంలో వెనుక నుంచి మరో బైక్ ఢీ కొంది. గాయపడిన శ్రీనివాసులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు


48వ డివిజన్‌లో పింఛన్లు మంజూరైన లబ్ధిదారులతో మేయర్ వసీం


పింఛన్ సొమ్ము అందిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అర్హతే ప్రమాణికంగా అర్హులందరికీ పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేయర్ వసీం పేర్కొన్నారు. నగరంలో కొత్తగా 671 మందికి పింఛన్ మంజూరైన విషయం విదితమే. వారికి రూ.19 లక్షలు నగరపాలక సంస్థ ఖాతాకు జమయ్యింది. మంగళవారం 48వ డివిజన్‌లో నూతనంగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు మేయర్ పంపిణీ చేశారు. నగరంలోని వివిధ డివిజన్లలో మొత్తం 23,652 మందికి వివిధ రకాల పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, నాయకులు ఖాజా పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి..

మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల బాలుర హాస్టల్ వద్ద డీసీబీ బ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మేయర్ వసీం మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్ భూషణ్, డీసీబీ బ్రాంచ్ మేనేజర్ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

రాప్తాడురూరల్: అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నట్లు సర్పంచు బండా అంజియాదవ్ తెలిపారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన వివిధ రకాల 51 పింఛన్లను మంగళవారం అందించారు. ఉప సర్పంచ్ మన్నల వరలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు కోమల గౌస్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

అనంతపురం రూరల్: పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నరసనాయనకుంట ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం పింఛన్ మంజూరు పత్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే ఆనంద్ శంకర్‌నాయక్ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పింఛన్ మంజూరు ప్రతాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిత్రలేఖన పోటీల్లో వైద్య విద్యార్థుల ప్రతిభ


మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాలలోని వైద్య విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ సాధించారు. వివరాల్లోకి వెళితే ఈ ఏడాది మేలో భారత రక్షణ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోనీ అనే స్వయం ప్రతిపత్తి సంస్థ మతసామరస్యంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించింది. వైద్య కళాశాల నుంచి ఏడుగురు మెడికోలు చిత్రలేఖన పోటీలకు మతసామరస్యంపై చార్టులపై గీసిన చిత్రాలను పంపారు. మెడికోలు ముస్కాన్, తేజశ్వినికి ప్రథమ, మహేంద్ర, చిత్రేష్‌లకు ద్వితీయ, చందన, హర్ష వీణ, రోహితులకు తృతీయ బహుమతులు దక్కాయి. భారత రక్షణ శాఖ కార్యదర్శి సంతకంతో వచ్చిన ప్రశంసాపత్రాలను మెడికోలకు మంగళవారం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బడి పక్కన బండ.. ప్రమాదమండోయ్!


ప్రమాదకరంగా మారిన గుంత

సాధారణంగా ఇద్దరు ముగ్గురు నడిచే దారి ముళ్లదారి అయితే.. 'జాగ్రత్త.. ముందు చూసి నడవండి' అని చెప్తుంటాం.. నిత్యం వాహనాలు, ద్విచక్ర వాహనాలు తిరిగే అనంతపురం రూరల్ మండలం పాపంపేట జెడ్పీహెచ్ఎస్ పక్కన కల్వర్టుపై ఏర్పాటు చేసిన బండరాయి కుంగిపోయి గుంత ఏర్పడింది. ప్రమాదకరంగా మారింది. ఇది కళ్యాణదుర్గం– బళ్లారి రోడ్డుకు లింక్ రోడ్డు కావడంతో నిత్యం వాహనాలు, ద్విచక్రవాహనాలు వెళ్తుంటాయి. పక్కనే పాఠశాల ఉండడంతో వందలాది మంది విద్యార్థులు దీని పక్కనే వెళ్తుంటారు. 15 రోజుల కిందట ఈ కల్వర్టు దెబ్బతిని గుంత ఏర్పడింది. బండరాయి అడ్డుగా పెట్టినా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల కిందట ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తూ పడింది. మంగళవారం ద్విచక్ర వాహనదారుడు ఇక్కడికి రాగానే అదుపుతప్పి కిందకు పడ్డాడు.

– రాప్తాడు రూరల్:

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే జైలుకే


దుకాణదారుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న కార్మిక, ఐసీపీఎస్ అధికారులు

అనంతపురం సిటీ: బాల కార్మికులను పనిలో పెట్టుకున్నా, వెట్టిచాకిరీ చేయించుకున్నా శిక్ష తప్పదని కార్మిక, ఐసీపీఎస్ అధికారులు హెచ్చరించారు.మంగళవారం 'ఆపరేషన్ స్వేచ్ఛ–3'లో భాగంగా అనంతపురంలో ఆపరేషన్ నిర్వహించారు. కార్మికశాఖ సహాయ అధికారులు ఎం.సుజాత, కె.రమాదేవి, జి.కృష్ణయ్య, ఐసీపీఎస్ కౌన్సిలర్ జె.సంధ్య ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ రోడ్డు, రుద్రంపేట బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్, తపోవనం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. సంస్థలు, దుకాణాలు, హోటళ్లను పరిశీలించారు. 18 ఏళ్లలోపు బాలలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అనంతరం కార్మికులతోనూ మాట్లాడారు. కార్మికులు ప్రతి ఒక్కరూ ఈ–శ్రమ్ కార్డులు పొందాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓను కలిసిన ఆయుష్ అసోసియేషన్ సభ్యులు


డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవిని సన్మానిస్తున్న ఆయుష్ మెడికల్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం క్రైం: డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవిని రాష్ట్ర ఆయుష్ మెడికల్ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓను శాలువా, పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పోగుల కుమారయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ కే వరప్రసాద్, డాక్టర్ షెక్షావలి, డాక్టర్ నీలేష్, డాక్టర్ పీ నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


50వ డివిజన్‌లో దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం నగరంలోని 50వ డివిజన్‌లో లార్వా నివారణకు స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్‌ను కాలువలు, కల్వర్టుల్లో వదిలే కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. దోమకాటుతో డెంగీ, మలేరియా, తదితర జ్వరాలు ప్రబలే అవకాశం లేకపోలేదన్నారు. నగర ప్రజలు వారంలో ఒక రోజు డ్రైడే పాటించి ఇళ్లు, పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. నీరు ఎక్కువ రోజు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు సైతం స్వీయ జాగ్రత్తలో భాగంగా దోమతెరలు, మస్కిటో కాయిల్స్, తదితర వాటిని వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, డివిజన్ కార్పొరేటర్ గురుశేఖర్ బాబు, సచివాలయ సిబ్బంది శంకర్ రెడ్డి, గీత, ఆశావర్కర్లు కుళ్లాయమ్మ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకుందాం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

శింగనమల:బాల్య వివాహాలను అడ్డుకుందామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. మంగళవారం పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాలు, అధికారుల విధులు – బాధ్యతలపై ఒక రోజు డివిజన్ స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. వీటిపై ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వివరించారు. సీడీపీఓలు భారతి, షాజిదా, ఎంపీడీఓలు యోగనందారెడ్డి, వీరరాజ రంగారావు, రామకృష్ణ, తహసీల్దార్లు మోహన్‌కుమార్, సుమతి, మునివేలు, లక్ష్మీనాయక్, మండల వైద్యాధికారులు శ్రీదేవి, చంద్రశేఖర్, నాగరాజు, ఓబులపతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, లీగల్ ఆఫీసర్ సంధ్యారాణి, చంద్రకళ, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శింగనమల: పుట్లూరు మండలం కోమటికుంట్ల పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. నిందితుల నుంచి రూ.1,10,650 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో రైల్వే ఏజీఎం

గుంతకల్లు రూరల్: దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధనుంజయులు దంపతులు మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న ఏజీఎం దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలతో పాటు స్వామి ఫోటోను బహూకరించారు.

కూచిపూడి నాట్యంలో చిన్నారుల ప్రతిభ

తాడిపత్రి అర్బన్: వారణాశీలోని కాశీ విశ్వనాథుని సన్నిధిలో నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలో తాడిపత్రికి చెందిన చిన్నారులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈనెల 9న వారణాశిలో కూచిపూడి నాట్య ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో తాడిపత్రి వందన డ్యాన్ అకాడమీకి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచి పురస్కారాలను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకుడు ప్రవీణ్ తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల తయారీపై శిక్షణ

రాప్తాడురూరల్: మట్టి వినాయక విగ్రహాల తయారీపై అనంతపురం హమాలీకాలనీలోని ఆర్యన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, గ్రీన్ ఆర్మీ సంయుక్తంగా ఈనెల 15న శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5–16 ఏళ్లలోపు పిల్లలు పాల్గొనొచ్చన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే మట్టి ప్రతిమల తయారీపై అవగాహన కల్పిస్తామన్నారు. పాత వాటర్ బాటిల్, పాతవస్త్రం వెంట తీసుకొని రావాలని, శిక్షణలో తయారు చేసిన ప్రతిమలను ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేసుకోవచ్చనానరు. వివరాలకు సెల్: 9989883032లో సంప్రదించాలన్నారు.

డ్యాన్స్‌లో ప్రతిభ


జాతీయ స్థాయిలో రెండో బహుమతి గెల్చుకున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన లహరి డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్‌మాస్టర్ హరిప్రసాద్ శిష్యబృందం 33వ జాతీయ శాస్త్రీయ జానపద నృత్యోత్సవాల్లో ప్రతిభ కనబరిచింది. ఈనెల 9 నుంచి 12 వరకు తిరుపతి మహతి ఆడిటోరియంలో రాయలసీమ రంగస్థలి శ్రీకృష్ణదేవరాయ దర్బార్ ఆధ్వర్యంలో నృత్యోత్సవాలు జరిగాయి. సోలో, గ్రూప్ డ్యాన్సు పోటీల్లో అవినాష్, పల్లవి, వైష్ణవి, భావన, అహమద్, అనూష తదితరులు ద్వితీయ స్థానం దక్కించుకొని తిరుపతి మేయర్ శిరీష చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

సంఘాల బలోపేతానికి చేయూత


సీసీలను సన్మానిస్తున్న సమాఖ్య సభ్యులు

కనగానపల్లి: డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని, మహిళల కోసం వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ తదితర పథకాలు అమలు చేస్తోందని ఏపీఎం హేమలత తెలిపారు. మంగళవారం స్థానిక వైకేపీ మహిళా భవనంలో వీరబ్రహ్మేంద్ర మండల సమాఖ్య వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండల సమాఖ్య లీడర్లతో పాటు పలువురు గ్రామ సంఘాల లీడర్లు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఏపీఎం మాట్లాడుతూ ఈ మండల సమైక్యను స్థాపించి 11 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. అనంతరం మండల సమాఖ్య కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో సంఘం లీడర్‌గా పి.నల్లమ్మ, ఉపాధ్యక్షురాలుగా సువర్ణ, కార్యదర్శిగా రాములమ్మ, సహకార్యదర్శి మణి, కోశాధికారిగా దివ్యశ్రీని ఎన్నిక చేశారు.

సిబ్బందికి సన్మానం:

మండలంలోని డ్వాక్రా సంఘాలకు సీసీలుగా పని చేస్తూ ఈ మధ్య కాలంలో ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఆనంద్, సోమశేఖర్‌లను మండల సమాఖ్య సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ సంఘాల లీడర్లతో పాటు పలువురు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.